సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం : 18 : ఫిబ్రవరి : 2023



రైతులు జాగ్రత్తగా ఉండాలి

వేములవాడరూరల్: ఎలుకల నుంచి పంటను కాపాడుకోవడంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని అధికారి ఐ.అరుణశ్రీ తెలిపారు.



గోదావరి జలాలు

వేములవాడ: రాజన్న భక్తులకు గోదావరి జలాలను బుధవారం నుంచి గుడి చెరువులోకి పంపింగ్ చేస్తున్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
33.0/16.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. తెల్లవారు జామున ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

20న ప్రజావాణి రద్దు

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 20న రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం తెలిపారు. 21న కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ కమిషన్ సమావేశం ఉన్నందున ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

ముస్తాబాద్(సిరిసిల్ల): పదోతరగతిలో అత్యుత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ కోరారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా బోధించాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. గణితం, ఇంగ్లిష్, సైన్స్ అంశాలలో వెనుకబడ్డ విద్యార్థులకు తరగతులు నిర్వహించాలన్నారు. అలాంటి వారి కోసం ప్రభుత్వం గోరు ముద్ద కూడా ఇస్తోందని తెలిపారు. పరీక్షలంటే భయాన్ని పోగొట్టాలన్నారు. హెచ్‌ఎంలు రాధాకిషన్‌రావు, విఠల్‌నాయక్, ప్రభాకర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు



అమ్మాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం అడవిపదిరలో ఓ బాల్య వివాహాన్ని మండల అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. అధికారులు తెలిపిన వివరాలు. అడవిపదిరకు చెందిన ఓ మైనర్ అమ్మాయితో కోనరావుపేట మండలం మర్రిమడ్లకు చెందిన యువకుడి వివాహాన్ని ఈనెల 24న చేసేందుకు నిశ్చయించుకున్నారు. ఈ విషయం తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ తోపాటు మండల అధికారులకు తెలిసింది. వెంటనే తహసీల్దార్ ఆఫీస్‌లో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పద్దెనిమిదేళ్లు దాటిన అనంతరం వివాహం చేయాలని, లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజన్న భక్తులకు హెలికాప్టర్ సౌకర్యం



వేములవాడకు చేరుకున్న హెలికాప్టర్

వేములవాడ: మహాశివరాత్రి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని రాజన్న భక్తులకు హెలికాప్టర్ సౌకర్యం కల్పించారు. శుక్రవారం సాయంత్రం హెలికాప్టర్ గుడి చెరువు ఖాళీ స్థలంలో హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయ్యింది. శని, ఆదివారాలు భక్తులను మిడ్‌మానేరు, నాంపల్లి గుట్ట వ్యూ చూపించనున్నారు.

సొంతింటి కల నెరవేర్చాం



తంగళ్లపల్లి(సిరిసిల్ల): నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడం సంతోషంగా ఉందని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి పరిధిలోని 60 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను శుక్రవారం సర్పంచ్ గనప శివజ్యోతి, ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజులతో కలిసి అందజేశారు. చిక్కాల రామారావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా 60 మంది నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీటీసీ బుస్స స్వప్న, ఉపసర్పంచ్ ధర్మారెడ్డి రాములు, సింగిల్‌విండ్ చైర్మన్ బండి దేవదాస్, వైస్‌చైర్మన్ రమణారెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల, నాయకులు గనప మధన్‌రెడ్డి, పూర్మాని లింగారెడ్డి, నక్క రవి, కందుకూరి రామాగౌడ్, కోడం సంధ్యారాణి, సద్ద శోభ, ఆర్‌వి మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ముల్లెమూటలతో తరలివస్తున్న భక్తులు



విద్యుత్‌దీపాల కాంతుల్లో రాజన్న ఆలయం ఏరియల్ వ్యూ



దారులన్నీ ఎములాడకే..

- నేడు మహాశివరాత్రి వేడుకలు
- తరలివస్తున్న అశేష భక్తజనం
- గుడిచెరువులో శివార్చన
- ఉచిత బస్సుల ప్రారంభం
- మూడు రోజులు అన్నదానం
- పోలీసుల భారీ బందోబస్తు





ధర్మగుండంలో స్నానాలు చేస్తూ..



శివుడి సైకత శిల్పం

వేములవాడ: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ హరహర మహాదేవ నామ స్మరణతో మారుమోగుతుంది. శివమాల ధారులు, వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో ఆధ్యాత్మిక క్షేత్రం కిక్కిరిసిపోతుంది. వేములవాడలోని శ్రీరాజ రాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివ రాత్రి వేడుకలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాజాతరకు నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే గుడారాలు వేసుకుంటున్నారు. ధర్మగుండంలోకి అనుమతి లేకపోవడంతో షవర్ల వద్ద స్నానాలు చేస్తున్నారు. గుడి ఆవరణలో జాగరణ కోసం భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్జిత సేవలను రద్దు చేసిన ఆలయ అధికారులు లఘు దర్శనాలకు మాత్రమే అనుమతించారు. రూ. 3.70 కోట్లతో జాతర ఏర్పాట్లు చేశారు. రాజ న్న గుడి చెరువు ఖాళీ స్థలంలో రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శివార్చనలో భాగంగా 1,600 మంది కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాస్‌ల జారీ విషయంలో ఉద్యోగులు, పురప్రముఖులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహాశివరాత్రి జాతరకు 3 లక్షల వరకు భక్తులు వస్తారని అధికారుల అంచనా. స్వామి మహామంటపంలో ఉత్సవమూర్తులను సిద్ధం చేసి ఉంచారు.

ఉచిత బస్సు సేవలు

దేవస్థానం తరపున 14 ఉచిత బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. ఈ సేవలను శుక్రవారం ప్రారంభించారు. తిప్పాపూర్ బస్టాండ్ నుంచి బైపాస్‌రోడ్డు గుండా జగిత్యాల బస్టాండు, గుడిప్రాంతం, బైపాస్‌రోడ్డు ద్వా రా కోరుట్లబస్టాండు, ప్రాంతాలను కలు పుతూ తిరిగి తిప్పాపూర్ బస్టాండ్ వరకు చే రుకుంటాయి. భక్తుల రద్దీని బట్టి బస్సులను తింపనున్నట్లు డీఎం మురళీకృష్ణ తెలిపారు.

నిరంతర అన్నదానం

జాతర మహోత్సవాలకు వచ్చే భక్తులు, పోలీసు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి స్థానిక వాసవీ సేవా సమితి, మన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి, ఈవో కృష్ణప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ అన్నదానం శని, ఆదివారాలు సైతం కొనసాగుతుందని నిర్వాహకులు మోటూరి మధు, కొమ్మ నటరాజ్ తెలిపారు. దాదాపు 30 వేల మందికి అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

ప్యూరిఫైడ్ వాటర్

వేములవాడఅర్బన్: మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఆలయ ఈవో కార్యాలయం వద్ద, గుడి పక్కన పార్కింగ్ ఏరియా, బద్దిపోచమ్మ గుడి వద్ద రాజన్న జలప్రసాదం మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాట్లు చేశారు. రాజన్న ఆలయం ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ట్యాంక్‌లను ట్రాలీ ఆటోలపై ఏర్పాటు చేసి ఉంచారు.



విద్యుత్‌దీపాల కాంతుల్లో రాజన్న ఆలయం

మొదలైన వేడుకలు

- రాజన్న ఆలయంలో మూడు రోజుల పాటు మహాశివరాత్రి వేడుకలు జరుగనున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవతో ఉత్సవాలు ఆరంభమయ్యాయి.
- ఉదయం 5 గంటలకు ప్రాతఃకాలపూజను స్థానాచార్యులు అప్పాల భీమశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం నిర్వహించారు.
- మధ్యాహ్నం 2.30 గంటలకు స్వామికి మహానివేదన చేశారు.

శనివారం నాటి కార్యక్రమాలు

- శనివారం మహాశివరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఉదయం స్వామి వారికి టీటీడీ దేవస్థానం తరపున పట్టు వస్త్రాలను టీటీడీ అధికారులు సమర్పిస్తారు.
- వేకువజామున 3.30 గంటల నుంచి 4 గంటల వరకు ఆలయ శుద్ధి, మంగళవాయిద్యాలు.
- 4 నుంచి 4.25 వరకు సుప్రభాత సేవ
- ఉదయం 7 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం తరపున జీఈవో, టీటీడీ అర్చకుల బృందం ఆధ్వర్యంలో రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.
- ఉదయం 8 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ పట్టువస్త్రాలు సమర్పిస్తారు. మంత్రుల తోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొననున్నారు.
- సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శివస్వాములకు ప్రత్యేక దర్శన అవకాశం.
- సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు కల్యాణ మంటపంలో మహాలింగార్చన.
- రాత్రి 11.35 నుంచి వేకువజాము 3.30 గంటల వరకు లింగోద్భవం. ఈ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు.



కళాకారులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్, ఎస్పీలు



కళాకారుల నృత్య ప్రదర్శన




శివార్చన ప్రారంభిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఆకట్టుకున్న శివార్చన

మహాశివరాత్రి వేడుకల సందర్భంగా రాజన్న గుడి ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన శివార్చన కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ కట్టుబడి ఉన్నారన్నారు. రూ.కోటి వ్యయంతో శివార్చన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా అధికారులు జాతర విజయవంతం చేసేందుకు ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, చైర్‌పర్సన్ మాధవి తదితరులు ఉన్నారు.



ఆలయం వద్ద పోలీస్ బందోబస్తు



రాజన్న గుడి చెరువు ఖాళీ ప్రదేశంలో నిలిపిన భక్తుల వాహనాలు



కోడెమొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

'అనంతగిరి'పై చిన్నచూపు !

- పర్యాటక అభివృద్ధిపై పట్టింపు కరువు
- కట్టపైకి ఎక్కాలంటే ఇబ్బంది
- కనిపించని బీటీ రోడ్డు, లైటింగ్
- కూర్చునేందుకు కుర్చీలు కరువు
- రిజర్వాయర్ నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు

ఇల్లంతకుంట(మానకొండూర్): చుట్టూ గుట్టలు.. పక్కనే పచ్చని పొలాలు.. మరో వైపు ప్రముఖ పుణ్యక్షేత్రం.. ఇన్ని ప్రత్యేకతలు ఉన్నా అనంతరగిరి రిజర్వాయర్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఆనకట్టపై కనీసం బీటీ రోడ్డు లేకపోగా.. పర్యాటకులు కూర్చునేందుకు కుర్చీలు కరువయ్యాయి. ఇక కట్టపైకి వెళ్లే రోడ్డు కంకర తేలి అధ్వానంగా ఉంది.

నాలుగేళ్ల క్రితం పూర్తి

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 10వ ప్యాకేజీలో భాగంగా ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి గ్రామం వద్ద 3.50 టీఎంసీల సామర్థ్యంతో అన్నపూర్ణ రిజర్వాయర్‌ను నిర్మించారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు గడుస్తోంది. రిజర్వాయర్‌ను చూసేందుకు చాలా మంది వస్తున్నారు. అయితే ఇక్కడ కనీసం తాగునీటి సదుపాయం లేదు. అనంతగిరి రిజర్వాయర్ చుట్టూ సహజసిద్ధమైన గుట్టలు ఉన్నాయి. గుట్టల మధ్య నదిలా ఉండే అనంతగిరి రిజర్వాయర్‌ను చూసేందుకు పర్యాటకుల సంఖ్య ఇటీవల పెరిగింది. రిజర్వాయర్ పక్కనే ప్రసిద్ధి చెందిన అనంతగిరి పోచమ్మ ఆలయం ఉంది. ఆలయం సమీపంలోనే పట్నంగుట్టపై నిజాం కాలం నాటి ఖిల్లా ఉంది. ఈ ప్రాంతంలో ఇన్ని విశేషాలు ఉన్నా పర్యాటకంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది.

రిజర్వాయర్‌లో 245 ఎకరాల ప్రభుత్వ భూమి

అనంతగిరి రిజర్వాయర్ మధ్యలో సుమారు 50 ఎకరాల వరకు ఐలాండ్ ఉంది. రిజర్వాయర్‌ను ఆనుకొని 200 ఎకరాల వరకు పచ్చటిగుట్టలు, ప్రభుత్వ భూములు ఉన్నాయి. మూడేళ్ల క్రితం సీఎం కేసీఆర్ సిరిసిల్ల పర్యటనకు వచ్చిన సమయంలో అనంతగిరి రిజర్వాయర్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ సీఎం హామీకి మూడేళ్లు గడుస్తున్నా నెరవేరలేదు.

రంగనాయకసాగర్‌పై సకల వసతులు

సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలంలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ ఆనకట్టపై మంత్రి హరీశ్‌రావు అన్ని హంగులను ఏర్పాటు చేశారు. బీటీ రోడ్లు, సెంట్రల్‌లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. రంగనాయకులగుట్టపై గెస్ట్‌హౌస్‌లు, కాటేజీలను అందుబాటులోకి తెచ్చారు. కానీ అనంతగిరి రిజర్వాయర్‌పై మాత్రం ఎలాంటి అభివృద్ధి చేయడం లేదు.



అనంతగిరి రిజర్వాయర్



అనంతగిరి కట్టపై మట్టిరోడ్డు



కట్టపైకి వెళ్లే రోడ్డు ఇలా..

ప్రతిపాదనలు పంపాం



అనంతగిరి రిజర్వాయర్ ఆనకట్టపై బీటీ రోడ్డు, లైటింగ్, పార్కు, ఇతర అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులు కేటాయిస్తే అన్ని హంగులు కల్పిస్తాం. గతంలోనే సీఎం కేసీఆర్ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు.

– శ్రీనివాసరావు, డీఈఈ, నీటిపారుదలశాఖ

పచ్చని పల్లెల్లో చేపల చిచ్చు

- చేపల పట్టుకునే విషయంలో వివాదం
- దాడులకు దిగుతున్న వైనం
- ఏడాదిలో 78 మందిపై కేసు
- చెరువులను ఖాళీ చేస్తున్న అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



చెరువులో చేపలు పడుతున్న వీర్నపల్లి తండా మహిళలు



చెరువు వద్ద పోలీసుల మోహరింపు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): అన్నదమ్ముల్లా కలసిమెలిసి ఉంటున్న పచ్చని పల్లెల్లో చేపలు పట్టే విషయం వివాదాస్పదంగా మారుతోంది. ఫలితంగా పల్లెల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. చేపలు పట్టుకునే విషయంలో ఘర్షణలు ఏర్పడుతుండడంతో కొన్ని చెరువుల్లోని నీటిని అధికారులు ఖాళీ చేసి తాత్కాలికంగా గొడవలకు అడ్డుకట్ట వేస్తున్నారు. ఇదే సమయంలో ఆయకట్టు రైతులు తమ పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా గ్రామాల్లోని మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 255 గ్రామపంచాయతీల్లో 625 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో సుమారు 295 చెరువులలో ప్రభుత్వం ఇచ్చిన చేపపిల్లలను వేశారు. చేపలను పట్టుకునే విషయంలో గిరిజనులు, ముదిరాజులు, మత్స్యకారుల మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయి. చెరువులపై తమకే హక్కులు ఉన్నాయంటూ ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారు.

16 మందిపై కేసులు

వీర్నపల్లి మండలకేంద్రం శివారులోని వెంకట్రాయిని చెరువులో చేపలు పట్టుకునే విషయంలో తండావాసులు, కంచర్ల గ్రామస్తుల మధ్య వివాదం నెలకొంది. ఐదు రోజుల క్రితం 16 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ బుధవారం ఇరువర్గాలు మళ్లీ చెరువు వద్దకు వెళ్లడంతో రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు, పోలీసులు రంగ ప్రవేశం చేసి చెరువును ఖాళీ చేసి సమస్యను సద్దుమణిగేలా చేశారు. అంతకుముందే గుర్తుతెలియని వ్యక్తులు చేపల విషయంలోనే చెరువుకు గండి కొట్టడంతో సగం నీరు వెళ్లిపోయింది.

25 చెరువుల్లో ఇదే పరిస్థితి

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, కోనరావుపేట, ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి, సిరిసిల్ల పట్టణంలోని పలు చెరువుల్లో చేపలు పట్టుకునే విషయంలో మత్స్యకారులు, ముదిరాజులు, గిరిజనుల మధ్య సమస్య తలెత్తుతోంది. చెరువులను సొసైటీలుగా మార్చి మత్స్య సహకార సంఘాలకు కార్యవర్గాల ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. చెరువులలో చేపలు పట్టుకునే విషయంలో ప్రభుత్వం ఎవరికి సరైన అధికారాలు ఇవ్వలేకపోతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులోని జక్కులచెరువు, రాచర్ల గుండారంలోని ఊరచెరువు దుమాల చెరువు, బండలింగంపల్లి శివారులోని పెద్దచెరువుల్లో చేపలు పట్టుకునే విషయంలో ఇరు వర్గాలు కోర్టుల చుట్టూ తిరగుతున్నారు.

సొసైటీల మాటేమిటి?

చెరువులపై ఆధారపడి మత్స్యకారులు తమ కుటుంబాలను పోషించుకునేందుకు ఎంపిక చేసిన చెరువుల్లో చేపలు పెంచుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుంది. చేపలు ఎదిగిన తర్వాత ఆయా చెరువులపై తమకే హక్కులున్నాయంటూ ఘర్షణలకు దిగుతున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం అన్ని చెరువులకు సొసైటీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఒక వర్గానికి అవకాశం ఇచ్చి వారికే సర్వహక్కులు కల్పించాల్సి ఉంది. ఇలాంటి నిర్ణయాలు అధికారులు తీసుకోలేకపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 78 మందిపై పెట్టిన కోర్టు కేసులను ఎత్తివేసి ప్రశాంత వాతావరణం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి కోల్పోతున్నాం



చెరువులోని నీటిని అధికారులు ఖాళీ చేయడంతో ఆయకట్టు పరిధి రైతులు ఉపాధి కోల్పోతున్నారు. పంటలు పండించుకోలేక పస్తుండాల్సిన పరిస్థి ఏర్పడుతోంది. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వమే ఉపాధి అవకాశాలు కల్పించాలి. చెరువులో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.

–జంగం అంజయ్య, రైతు విభాగం జిల్లా కార్యదర్శి

సమస్యను పరిష్కరించాలి



అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి. గ్రామాల్లో చెరువుల వివాదాలతో ఘర్షణలు తలెత్తుతున్నాయి. అలాంటి వాతావరణంలో ఒకరినొకరు చూసుకొని బతకడం ఇబ్బందిగా ఉంది. ఈ విషయంపై అధికారులు స్పందించాలి.

– గంగధారి సంజీవ్, రైతు

చెరువుల్లోకి దిగితే కేసులే..



అనుమతులు లేకుండా చేపలు పట్టడానికి చెరువులోకి దిగితే కేసులు నమోదు చేస్తాం. చేపలు పట్టుకునే హక్కులు ఎవరికైతే ఉంటాయో వారు అధికారులు అనుమతులు తీసుకొని చేపలు పట్టుకోవాలి. ప్రశాంత వాతావరణంలో చెదర గొట్టే వారిని ఉపక్షించేది లేదు.

– మొగిలి, సీఐ, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య



గంగయ్య(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): పొట్టచేత పట్టుకుని గల్ఫ్ బాటపట్టిన వలసజీవి.. స్వగ్రామం చేరి అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముస్తాబాద్‌లో వెలుగుచూసింది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన శ్యాగ గంగయ్య(43) గల్ఫ్‌బాట పట్టి అక్కడ సరైన ఉపాధిలేక మూడేళ్ల క్రితం ముస్తాబాద్ తిరిగి వచ్చాడు. ఈక్రమంలో గొర్రెలు కాస్తూ.. రూ. 5 లక్షలు అప్పులు చేసి కూతురు పెళ్లిచేశాడు. దీనికి తోడు గల్ఫ్‌కు వెళ్లిన అప్పులు తోడయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన గంగయ్య గురువారం ఇంట్లో పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు ఓప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు మహేశ్, కూతురు మౌనిక ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డి వాము దగ్ధం



కాలుతున్న గడ్డివాము

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల గ్రామంలో వడ్డెరకాలనీ పాఠశాల వెనుక వైపు పంటపొలాల్లో గురువారం ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. బాధిత రైతులు దుండిగాల రాములు, లోకుర్తి లచ్చయ్యకు చెందిన రెండు గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం చుట్టుపక్కల రైతులు గడ్డివాము తగలబడుతోందని అందించిన సమాచారంతో అక్కడికి వెళ్లి చూసేసరికి పూర్తిగా కాలిబూడిదైందని, సుమారు రూ.20 వేలు నష్టంవాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

స్టోన్‌క్రషర్ లైసెన్సు రద్దు చేయాలి

తంగళ్లపల్లి: మంత్రి కేటీఆర్ నియోజకవర్గంలో అక్రమణ లీలలు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్(టోని) ఆరోపించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతూ.. రాళ్లపేట గ్రామ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న స్టోన్‌క్రషర్‌పై జిల్లా ఉన్నతాధికారు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. గత సోమవారం 'సాక్షి'లో ప్రచురించిన 'హద్దులు దాటి గుట్టలు లూటీ' కథనాన్ని చూపుతూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అక్రమార్కుల వంతపాడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ గ్రామాల్లో వెలిసిన అక్రమ వెంచర్లను కాంగ్రెస్ ఆధ్వర్యంలో సందర్శించి ఈనెల 20న తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఫిర్యాదు చేస్తామన్నారు. గుగ్గిళ్ల శ్రీకాంత్, రైతుసెల్ అధ్యక్షుడు పొన్నాల పర్శురాం, సీనియర్ నాయకులు సుద్దాల శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు, గడ్డం మధుకర్(చోటు), బండి పరుశురాం, యోగి, విక్కీ పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో మహిళపై దాడి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన వివాహిత ఎండపల్లి రాజేశ్వరిపై మంత్రాల నేపథ్యంలో ముగ్గురు దాడిచేసి చితకబాదారు. ఈ సంఘటనలో ఆమె గాయపడడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. రాజేశ్వరి భర్త దేవేందర్ జీవనోపాధి కోసం మహారాష్ట్రలోని నాందేడ్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తనకు మంత్రాలు వస్తాయని పది రోజులుగా ముగ్గురు వ్యక్తులు మానసికంగా వేధిస్తున్నారని రాజేశ్వరి పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఈనెల 13న గ్రామానికి చెందిన సుమలత, సత్తవ్వతోపాటు దుమాలకు చెందిన హరిత దాడిచేసినట్లు పేర్కొంది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించింది.

కరెంటు కాటుకు యువకుడు బలి?



నాగరాజు(ఫైల్)

సిరిసిల్లటౌన్: విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న యువకుడికి కరెంటు షాక్ తగలడంతో విద్యుత్ స్తంభంపై నుంచి పడి మృతిచెందిన ఘటన సిరిసిల్లలో కలకలం రేపింది. స్థానికులు, తోటికూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రం సిరిసిల్ల పరిధిలోని వెంకంపేట–పెద్దబోనాల వరకు రోడ్డువిస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ పనులు పునరుద్ధరిస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం తీగలపల్లికి చెందిన వనమాల నాగరాజు(24) స్తంభంపై పనులు చేస్తున్నాడు. అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో స్తంభంపై నుంచి కిందపడ్డాడని వెంటనే జిల్లాసుపత్రికి తరలించేలోపే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని బాధితులు తెలిపారు. కాంట్రాక్టర్, సెస్ అధికారుల నిర్లక్ష్యానికి బలైన నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు. కాగా సెస్ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణను ఈ విషయమై వివరణ కోరగా..స్తంభంపై నుంచి జారిపడింది వాస్తవమేనని, ఆ సమయంలో విద్యుత్ సరఫరా కాలేదన్నారు. ఈ ఘటనలో అధికారులు, కాంట్రాక్టర్ తీరుపై విమర్శలు రావడం గమనార్హం.

పుచ్చకాయపై శివుని ప్రతిమ



పుచ్చకాయపై శివుని ప్రతిమతో అనిల్‌కుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేటకు చెందిన కార్వింగ్ కళాకారుడు సామంతుల అనిల్‌కుమార్ శుక్రవారం పుచ్చకాయపై శివుని ప్రతిమను చెక్కాడు. 15 నిమిషాల వ్యవధిలోనే తన కళానైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఏటా శివరాత్రిని పురస్కరించుకొని తన కళా నైపుణ్యంతో గుమ్మడికాయ, పుచ్చకాయలపై శివుని ప్రతిమను కార్వింగా చేసి స్థానిక శివాలయంలో అందజేస్తుంటాడు.

కారణజన్ముడు సీఎం కేసీఆర్

- ఘనంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు..
- స్వీట్లు పంచి, టపాసులు కాల్చి, రోగులకు పండ్లు పంచిన పార్టీ శ్రేణులు
- రాగి జావ పంపిణీ, ఆలయాల్లో పూజలు
- జిల్లా రైతుబంధు సమితి ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు..



సిరిసిల్ల గాంధీచౌక్‌లో కేక్ కట్‌చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

సిరిసిల్ల: బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ కారణజన్ముడని తెలంగాణ రాష్ట్ర పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో వేడుకలను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీచౌక్‌లో భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. టపాసులు కాల్చారు. పేదలకు రాగి జావ పంపిణీ చేశారు. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు విద్యానగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేసి సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

మొక్కలు నాటిన నేతలు..

సిరిసిల్ల విద్యానగర్ కొండా లక్ష్మణ్‌బాపూజీ సర్కిల్ నుంచి రగుడు మొదటి బైపాస్ రోడ్డులో హరితహారం నిర్వహించి మొక్కలు నాటారు. సిరిసిల్ల పట్టణ శివారులోని చంద్రంపేట జ్యోతినగర్ రైతువేదికలో జిల్లా రైతుబంధు సమితి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. సర్వమత ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, 'సెస్' డైరెక్టర్లు దార్నం లక్ష్మీనారాయణ, దిడ్డి రమాదేవి, సిరిసిల్ల అర్బన్ రైతుబంధు సమితి చైర్మన్ ఒజ్జెల అగ్గిరాములు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వెల్జీపూర్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు



మొదలైన రోడ్డు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

సిరిసిల్ల: జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలోని పల్లెలరోడ్ల దుస్థితిపై 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి పీఆర్ అధికారులు స్పందించారు. తంగళ్లపల్లి మండల కేంద్రం నుంచి ఇల్లంతకుంట మండలం వెల్జీపూర్ వరకు ఉన్న తారు రోడ్డు పూర్తిగా పాడయింది. ఈ రోడ్డు గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో జిల్లా పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశ్ స్పందించారు. లక్ష్మీపూర్–వెల్జీపూర్ గ్రామాల మధ్య గుంతలు పడిన రోడ్డుపై తాత్కాలికంగా మరమ్మతు పనులను శుక్రవారం ప్రారంభించారు. వాస్తవానికి ఈ రోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్‌వైలో రూ.9.80 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డును 3.75 మీటర్ల నుంచి 5.50 మీటర్ల మేరకు విస్తరించాల్సి ఉంది. కానీ పనులు చేయడం లేదు. కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆ రోడ్డు నిర్మాణం, విస్తరణ పనులను ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామీణులు కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విరజిమ్ముతున్న విద్యుత్ కాంతులు



వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు పట్టణంలోని ప్రధాన కూడళ్లు విద్యుత్‌కాంతులతో విరజిమ్ముతున్నాయి. నందికమాన్ నుంచి వేములవాడ రహదారిలో చెట్లకు ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్ దీపాలు ఆకర్షణగా కనిపిస్తున్నాయి. నాంపల్లి గుట్టచుట్టూ, కాళేయ మార్ధనంకు రంగురంగుల విద్యుత్ కాంతులు ఆకట్టుకుంటున్నాయి.

మహాజాతరలో ఉచిత వైద్యసేవలు

- మూడు రోజులపాటు నిరంతర సేవలు
- 11 వైద్యశిబిరాలు.. 24 గంటల సేవలు



వేములవాడలోని అమ్మవారి కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న సన్నిధిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రాజన్న భక్తులకు మూడు రోజులపాటు శుక్ర, శని, ఆదివారం మూడు రోజులు నిరంతరంగా ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. రాజన్న భక్తులకు అత్యవసర సేవలను రాత్రి, పగలు తేడలేకుండా చికిత్స అందించేందుకు వైద్యసిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

11 ఉచిత వైద్యశిబిరాలు

మూడు రోజులపాటు వేములవాడలోని భక్తులకు వైద్యసేవలు అందించేందుకు 11 వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టులలో వైద్యసిబ్బంది పనిచేయనున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు ఉంటుంది. 24 గంటల వైద్య సేవల ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలు అమ్మవారి కాంప్లెక్స్, రాజన్న ఆలయ గుడి వద్ద ఈవో కాంప్లెక్స్, లడ్డూ కౌంటర్ వద్ద, పాతగుడి చెరువులోని శివర్చాన వద్ద, తిప్పాపూర్ ఏరియా ఆస్పత్రి వద్ద వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ వద్ద, జగిత్యాల బస్టాండ్ వద్ద, కోరుట్ల బస్టాండ్ వద్ద, భీమేశ్వర ఆలయం వద్ద, నాంపల్లి గుట్ట మీద, అగ్రహారం హనుమాన్ ఆలయం వద్ద ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటలకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారు.

విధుల్లో 146 మంది సిబ్బంది

మహాజాతరలో 146 మంది వైద్యసిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. వేములవాడ, చందుర్తి, కోనరావుపేట, బోయినపల్లి మండలాల ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది రానున్నారు. అందులో 16 మంది మెడికల్ ఆఫీసర్లు, 45 మంది సూపర్‌వైజర్లు, 10 మంది ఫార్మసిస్టులు, 49 మంది ఏఎన్ఎంలు, ధర్మగుండం క్లోరినేషన్ చెకింగ్ టీమ్ ఏడుగురు, రెస్క్యూ టీమ్ 9, రెస్పాండ్ టీమ్ ఏడుగురిని ఏర్పాటు చేశారు. 108 అంబులెన్స్‌లు నాలుగు ఏర్పాటు చేశారు. అమ్మవారి కాంప్లెక్స్, ఈవో ఆఫీస్, శివర్చాన, తిప్పాపూర్ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేశారు.

అందుబాటులో సిబ్బంది



రాజన్న ఆలయంలో జరిగే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తుల కోసం 11 ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాం. భక్తులకు ఎలాంటి ఆత్యవసర సేవలకు వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎమర్జెన్సీ అవసరం ఉంటే ఏరియా ఆసుపత్రిలో బెడ్‌లను కూడా సిద్ధంగా ఉంచాం. మూడు రోజులు వైద్యసిబ్బంది శిబిరాల వద్దనే విధులు నిర్వహిస్తున్నారు.

– సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

అక్రమ కేసులు ఎత్తివేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశం
- పోలీసులు అదుపులో బీడీ కార్మిక సంఘం నాయకులు
- విడుదల చేయాలని ప్రజాసంఘాల డిమాండ్

సిరిసిల్ల: బీడీ కార్మిక సంఘాల నాయకులపై కామారెడ్డి పోలీసులు అక్రమంగా నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశం శుక్రవారం కోరారు. కామారెడ్డి పోలీసులు బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సామ అనసూర్య, రాష్ట్ర నాయకురాలు వెంకటలక్ష్మిని ఫిబ్రవరి 13న అదుపులోకి తీసుకున్నారన్నారు. వీరిపై అక్రమ కేసులు నమోదుచేశారని మల్లేశం ఆరోపించారు. మహిళలకు ఉపాధి కల్పిస్తున్న బీడీ పరిశ్రమలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యపై కార్మిక నాయకురాళ్లు పోరాటం చేస్తున్నారని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు బైరాగి మోహన్, కార్యదర్శి మల్సూర్‌లు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో బీడీ యజమానుల సంఘం నాయకుడైన చాట్ల నర్సింహులు, విప్లవోద్యమం నుంచి లొంగిపోయిన సాగర్‌లు పూర్వపు పరిచయాలతో కొత్త కార్మిక వేతన ఒప్పందాలు చేసుకున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు అల్లూరి విజయ్, రాయిసిడాం బాబురావు, రైతుకూలీ పోరాట సమితి నాయకులు పటోళ్ల నాగిరెడ్డి, బొమ్మకంటి కొమురయ్య, స్త్రీ విముక్తి (పీఓడబ్ల్యూ) నాయకులు ఏ.పద్మలు ఆరోపించారు. లోపాయికారి ఒప్పందాలు బయటకురావడంతో పోలీసులతో కుమ్మక్కయిన నర్సింహులు, సాగర్‌లు బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. జనశక్తి పార్టీతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ... కామారెడ్డి పోలీసులు బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సామ అనసూర్య, రాష్ట్ర నాయకురాలు వెంకటలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారని వివరించారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, బీడీ కార్మిక సంఘాల నాయకులు ఈ అక్రమ అరెస్టలను ఖండించాలన్నారు. బీడీ యజమాన్య సంఘాలను బురిడీ కొట్టించిన నర్సింహులు ఆడుతున్న నాటకంతో బీడీ పరిశ్రమ ఉనికికే ప్రమాదం ఏర్పడిందని మల్లేశం, మోహన్, మల్సూర్, విజయ్, బాబురావు, నాగిరెడ్డి, కొమురయ్య, పద్మలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమ అరెస్టలను ఖండిస్తున్నామని, భేషరతుగా బీడీవర్కర్స్ యూనియన్ నాయకులను విడుదల చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు.